# మెజార్టీ ఎంపీ సీట్లు గెలుస్తాం..



చాదర్‌ఘాట్, మార్చి 27: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయినా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని మాజీ ఉపముఖ్య మంత్రి మహమూద్ అలీ అన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 17 ఎంపీ స్థానాల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని తెలిపారు. బుధవారం అజంపురాలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు. కాళేశ్వరాన్ని మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేసే పార్టీ బీఆర్‌ఎస్ ఒక్కటేనని గుర్తు చేశారు.


నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
15 | హైదరాబాద్, గురువారం 28 మార్చి 2024 | HYDERABAD




కంటోన్మెంట్‌లోని రసూల్‌పురాలో 313 యువ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఖర్జూర పండు తినిపించారు. కేటీఆర్ వెంట బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు కేటీఆర్ సూచించారు.

- కంటోన్మెంట్, మార్చి 27

# బీఆర్‌ఎస్ దూకుడు

పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ముగిసిన సన్నాహక సమావేశాలు

త్వరలో అసెంబ్లీ నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశాలు


రాబోయే నెలన్నర రోజులు ప్రజాక్షేత్రంలో ఉండేలా ప్రచార కార్యాచరణ

ఆ తర్వాత రోడ్‌షోలు, బహిరంగ సభలకు ప్లాన్

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ దూకుడు పెంచింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాలకు ఎంపీ అభ్యర్థులుగా శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లను బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వ్యూహాత్మకంగా రంగంలోకి దించారు. ఇందులో భాగంగానే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే పునరావృతం చేసేలా.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు, క్యాడర్‌తో కలిసి వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం మినహా అన్ని పార్లమెంట్ స్థానాలకు సంబంధించి వరుసగా రెండు రోజులు సమావేశాలు నిర్వహించి శ్రేణులకు ప్రచారంలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించి, పార్టీ అభ్యర్థుల గెలుపునకు పక్కా ప్రణాళికల అమలుకు దిశానిర్దేశం చేశారు.

### ఇక నియోజకవర్గాల వారీగా సమీక్షలు

వరుసగా జరిగిన సమావేశాలతో పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ నేపథ్యంలోనే త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా విస్తృత స్థాయి సమావేశాలకు సిద్ధమవుతున్నారు. సికింద్రాబాద్, సనత్‌నగర్, అంబర్‌పేట, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ప్రచారం వచ్చే ఆదివారం నుంచి వరుసగా నియోజకవర్గాల వారీగా సమీక్షలకు సిద్ధమవుతున్నారు. పార్టీ అభిమానులు, నాయకులు వేల సంఖ్యలో సమావేశాలకు హాజరై అభ్యర్థి గెలుపునకు కార్యాచరణతో ముందుకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రస్తుత ఎన్నికల్లో అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్‌ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం.. అన్ని వర్గాల సంక్షేమాన్ని సైతం విస్మరించడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేసేలా ప్లాన్ చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు ముగిసిన తర్వాత మరోసారి పార్లమెంట్ స్థాయిలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం, ఆ తర్వాత కేసీఆర్‌తో భారీ బహిరంగ సభల నిర్వహణకు సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తుండడంతోపాటు రోడ్ షోలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.




కేసీఆర్‌తో భారీ బహిరంగ సభలు

# పజ్జన్న వెంటే మేమంతా



ఎమ్మెల్యేగా పద్మారావు ఎంతో చేశారు..

ఎంపీగా గెలిపిస్తే.. ఇంకా అభివృద్ధి చేస్తారు

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : '' పజ్జన ఎమ్మెల్యేగా సికింద్రాబాద్‌ను ఎంతో అభివృద్ధి చేశారు. ఎంపీ అయితే ఇంకా చేస్తారు.. అందుకే మా ఓటు పజ్జన్నకే. ప్రజల సమస్యలు తెలిసిన నాయకుడికే మా మద్దతు. కిషన్ రెడ్డి ఎంపీగా ఉండి చేసిందేమీ లేదు.'' అని సికింద్రాబాద్ ప్రజలు నినదిస్తున్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ బరిలో నిల్చిన తీగుళ్ల పద్మారావు గౌడ్‌కు జనం నీరాజనాలు పలుకుతున్నారు. 50 ఏండ్లలో కనిపించని అభివృద్ధి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పజ్జన్న ఎమ్మెల్యేగా సాధ్యమైందని చెబుతున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, రూ.800 కోట్లతో వివిధ రంగాల నిర్మాణ పనులు చేపట్టి అక్కడి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. ఇదే అసెంబ్లీ నియోజకవర్గం ప్రజల ఆదరణతో పద్మారావు గౌడ్ మంత్రి, శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా పదవులు చేపట్టారు.

ఎమ్మెల్యేగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో
రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు
15,444 మందికి ఆసరా పెన్షన్లు
449 పొదుపు సంఘాలకు రుణాలు
గత ఎంపీ సికింద్రాబాద్‌కు చేసిందేమిటీ.?
చర్చించుకుంటున్న నియోజకవర్గ ప్రజలు

### ప్రజా సంక్షేమమే పరమావధిగా..

గడిచిన పదేండ్లలో అన్ని వర్గాల అభివృద్ధిపై పద్మారావు దృష్టి సారించారు. సీతాఫల్ మండి ప్రభుత్వ స్కూల్‌లో రూ.29.75 కోట్లతో జూనియర్, డిగ్రీ కాలేజీ మంజూరు చేయించారు. సికింద్రాబాద్ పరిధిలో 5 స్కూళ్లను ఎంపిక చేసి రూ.50 లక్షల చొప్పున నిధులను మంజూరు చేయించారు. నిరుద్యోగులకు స్కిల్స్ శిక్షణ ఇచ్చేందుకు సెట్విన్ కేంద్రాలను ఏర్పాటు చేసి 3,500మందికి ఉపాధి కల్పించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లను సీతాఫల్ మండీ, అంబర్‌నగర్, అడ్డగుట్టలో నెలకొల్పారు. సీతాఫల్‌మండీ కుట్టి వెల్లోడి ఆసుపత్రి 75పడకల స్థాయికి పెంచి కొత్త భవనాల నిర్మాణానికి రూ.9.25 కోట్ల నిధులను మంజూరు చేయించారు. రవీంద్రనగర్, చింతబావి, దుడ్‌బావి, ఇందిరానగర్, అంబర్‌నగర్‌లో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారు. 15,444మందికి ఆసరా పెన్షన్లు అందించారు.



### మహిళా పొదుపు గ్రూపులకు భరోసా..!

449 పొదుపు సంఘాలకు రూ.40 కోట్ల రుణాలు, సీఎం సహాయనిధి కింద సుమారు 3,100మందికి రూ.29కోట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద 4,526 మందికి రూ.45.26 కోట్లు, దళిత బంధు స్కీంలో 100మందికి రూ.10 లక్షల చొప్పున, బీసీ కార్పొరేషన్ ద్వారా సుమారు 200 మందికి రూ.50 వేల చొప్పున రుణాలను అందించారు. మహాత్మాజ్యోతిరావు పూలే విదేశీ విద్యానిధిలో భాగంగా రూ.20లక్షల చొప్పున ఏడుగురికి అందించారు.

### అత్యాధునిక నిర్మాణాలు..!

రూ.14 కోట్లతో రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణానికి నిధులను మంజూరు చేయించి 846 పనులను చేపట్టారు. రూ.100 కోట్లకుపైగా నిధులతో రిజర్వాయర్ల పునర్నిర్మాణం చేపట్టారు. సీతాఫల్‌మండీలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, బోయ బస్తీ, మధురనగర్ కాలనీలో ఫంక్షన్ హాల్‌లను నిర్మించారు. అడ్డగుట్ట, లాలాపేటలో కొత్తగా మరో రెండు ఫంక్షన్ హాల్స్ నిర్మాణంలో ఉన్నాయి. తుకారం గేటు వద్ద రూ.73 కోట్లతో ఆర్‌యూబీ నిర్మించారు. మెట్టుగూడలో రూ.30 కోట్లతో, మాణికేశ్వర్‌నగర్‌లో రూ.20 కోట్లతో రెండు ఆర్‌యూబీల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించారు. రూ. 6.10 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని ప్రారంభించారు.


# గుక్కెడు నీటికి.. అల్లాడుతున్న నగరం

గ్రేటర్‌లో తాగునీటికి గండం
మార్చి నెలలోనే.. మంచినీటికి మల్లగుల్లాలు
రోజుల తరబడి ఎదురుచూపులు
బస్తీలు, కాలనీలకు అరకొర సరఫరా
మరికొన్ని ప్రాంతాల్లో లో ప్రెషర్‌తో అవస్థలు
బుక్ చేసి వారం రోజులైనా ట్యాంకర్ దిక్కులేదు
సరఫరా.. డిమాండ్‌కు కుదరని పొంతన
చేతులెత్తేస్తున్న జలమండలి
ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందో?

మీర్‌పేట్‌కు చెందిన ఓ వినియోగదారుడు (క్యాన్ నంబర్‌తో) ఈ నెల 26న మంచి నీటి ట్యాంకర్ కోసం జలమండలి వినియోగదారుల కేంద్రంకు ఫోన్ చేశాడు. ట్యాంకర్ బుక్ అయినట్లు సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చింది. వాస్తవానికి 24 గంటల్లో ట్యాంకర్ పంపించాలి. కానీ ట్యాంకర్ రాలేదు.

జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వినియోగదారుడు క్యాన్ నంబర్‌తో నీటి ట్యాంకర్ కోసం సంప్రదించాడు. కానీ క్యాన్ నంబర్‌పై పెండింగ్ బకాయి ఉన్నదని చూపించింది. ఆ ఫీజు చెల్లించారు. అయితే అప్‌డేట్ అవ్వడానికి మరో 24 గంటల సమయం పడుతుందని సందేశం వచ్చింది. దీంతో మళ్లీ ట్యాంకర్ బుక్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్ని రోజులకు ట్యాంకర్ వస్తుందో కూడా తెలియని దుస్థితి జలమండలిలో నెలకొంది.

**వేసవి మొదట్లోనే.. మహా నగరం** గొంతెండుతోంది. తాగునీటి కోసం తండ్లాడుతోంది. ఎండలు మండిపోతుండటంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. నిర్వహణ లోపాలతోనే ఈ పరిస్థితి నెలకొన్నది. ప్రజా అవసరాలకు అనుగుణంగా సరఫరా లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. వారానికోమారు కూడా నీటి సరఫరా జరగడం లేదని ధ్రువపడింది. బస్తీలు, కాలనీలకు అరకొర నీటి సరఫరా, కలుషిత జలాల సరఫరా తదితర సమస్యలు కళ్లకు కట్టాయి. సరఫరా.. డిమాండ్‌కు పొంతన కుదరడంలేదు. గ్రేటర్‌లో వేలాది బోరుబావులు అడుగంటి పోవడంతో అపార్ట్‌మెంట్ల వాసులు నీటికోసం చుక్కలు చూస్తున్నారు. ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిపోవడంతో బుకింగ్ చేసిన వారం రోజులకు సైతం రావడంలేదు. దీంతో విసిగివేసారిన ప్రజలు జలమండలి కార్యాలయాల వద్ద ఆందోళనకు దిగుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న అక్రమార్కులు నీటి కష్టాలను సొమ్ము చేసుకుంటున్నారు.




సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ) : పదేండ్ల తర్వాత గ్రేటర్ వాసులు గుక్కెడు నీటికోసం అల్లాడిపోతున్నారు. కేసీఆర్ హయాంలో.. పదేండ్ల కాలంలో ఏ రోజూ రాని నీటి సమస్య.. కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన మూడు నెలల్లోనే కరువు కోరలు చాస్తున్నది. మళ్లీ ఖాళీ బిందెలు చేతపట్టి రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చింది. కండ్లముందు నీటి కష్టాలు కనిపిస్తున్నా జలమండలి అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారానికోమారు అరకొరగా నీటి సరఫరా జరుగుతుండగా, ట్యాంకర్ల ద్వారా సైతం సరఫరా కాకపోవడంతో కాలనీల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మార్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని తలుచుకుంటేనే భయం వేస్తున్నదని మహిళలు వాపోతున్నారు. పదేండ్లుగా మూలన పడేసిన డ్రమ్ములను మళ్లీ తీయాల్సి వచ్చిందని తెలుపుతున్నారు.



బిందెనక బిందె..! ▶ కూకట్‌పల్లి నియోజకవర్గంలో తాగునీటి కోసం బిందెలతో క్యూలో నిలబడిన మహిళలు (ఫైల్)

### బుకింగ్‌ల సంఖ్య పెరిగిపోతున్నది

రాజేంద్రనగర్‌లో భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో బోర్లు పూర్తి స్థాయిలో ఎండిపోతున్నాయి. నల్లాల ద్వారా వచ్చే నీరు సరిపడా రాకపోవడంతో ట్యాకర్లపై ఆధారపడుతున్నారు. ఎండలు పెరిగినాకొద్ది రోజురోజుకు బుకింగ్‌ల సంఖ్య పెరిగిపోతుందని, ట్యాంకర్ బుకింగ్ చేసిన రెండు రోజులకు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

### లో ప్రెషర్, కలుషిత జలాలతో అవస్థలు

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్, హెచ్‌ఎఫ్‌నగర్, కార్మికనగర్, ఎస్‌పీఆర్ హిల్స్‌లో కన్నీటి కష్టాలు తప్పేలా లేవు. అరకొర నీటి సరఫరాకు తోడు లోప్రెషర్, కలుషిత జలాలలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎస్‌పీఆర్ హిల్స్‌లో రూ.11కోట్ల వ్యయంతో రిజర్వాయర్ నిర్మాణానికి సంకల్పించింది. ఈ పనులను శుక్రవారం రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు.

### కూకట్‌పల్లిలో ట్యాంకర్ బుకింగ్ చేస్తే 4 రోజులకు

కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటడంతో మూడు నెలల్లోనే వందలాది బోరుబావులు ఎండిపోయాయి. దీంతో జలమండలి ట్యాంకర్లు, ప్రైవేట్ ట్యాంకర్లకు ఫుల్ డిమాండ్ పెరుగుతుంది. ప్రస్తుతం రోజుకు 650 నుంచి 700 ట్యాంకర్ల నీటికోసం ప్రజలు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేస్తుండగా వారికి తాగునీటిని అందించేందుకు 48గంటల నుంచి నాలుగు రోజులు పడుతుందని అధికారులు చెబుతున్నారు.

### ఎల్బీ నగర్‌లో ఎండిపోయిన బోరుబావులు

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు జలమండలి సరఫరా చేసే నీటిపైనే ఆదారపడుతున్నాయి. వేసవికాలం కావడంతో మంచినీటి కోసం డిమాండ్ పెరుగుతున్నది. భూగర్భ జలాలు అడుగంటడంతో ఇండ్లలోని బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రతిరోజు సుమారు 120 నుంచి 150 ట్యాంకర్ల వరకు సరఫరా చేస్తున్నారు.

### సింగరేణి కాలనీలో డ్రమ్ములు దర్శనం

మలక్‌పేట్ నియోజకవర్గంలో 15వేల మంది సింగరేణి గుడిసెల వాసులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే అరకొర తాగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్ల ముందు డ్రమ్ములు పెట్టుకొని ట్యాంకర్లు ఎప్పుడువస్తాయోనని ఎదరుచూస్తూ.. ట్యాంకర్లతో పోసే నీటితోనే తమ అవసరాలు తీర్చుకుంటున్నారు.

### తాగునీటికోసం ఎస్‌ఆర్‌నగర్‌లో ధర్నా

వేసవి ప్రారంభంలోనే ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో నీటి కష్టాలు తీవ్రంగా మారాయి. వారానికోమారు నల్లాల ద్వారా అరకొరగా నీటి సరఫరా జరుగుతుండగా, ట్యాంకర్లు బుకింగ్ చేసుకున్నా రావడానికి తీవ్ర జాప్యం జరుగుతుందని వాపోతున్నారు. ముఖ్యంగా జలమండలి డివిజన్ -6 పరిధిలోకి వచ్చే రహ్మత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో మంచినీటి కష్టాలు తీవ్రంగా మారాయి. దీంతో రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ వాసులు ఎస్‌ఆర్‌నగర్‌లోని జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బంజారాహిల్స్ సబ్ డివిజన్ పరిధిలోని బంజారాహిల్స్, తట్టిఖానా సెక్షన్ల పరిధిలో ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. రోజుకు సుమారు 900 నుంచి వెయ్యి ట్యాంకర్లు కావాలంటూ ఆర్డర్లు వస్తుండగా కేవలం 600 నుంచి 700 ట్యాంకర్లను మాత్రమే పంపించగలుగుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయలేక జలమండలి అధికారులు చేతులెత్తేస్తున్నారు.



ఎస్‌ఆర్‌నగర్‌లోని జలమండలి డివిజన్ - 6 కార్యాలయంలో ఆందోళన చేసేందుకు వచ్చిన రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన స్థానికులు

### శేరిలింగంపల్లిలో తప్పని నీటి తిప్పలు

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని సెక్షన్‌లలో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. జలమండలి కార్యాలయానికి చెందిన వాటర్ ట్యాంకర్లను బుక్ చేసుకునే వారి సంఖ్య రెట్టింపు అయ్యింది. శేరిలింగంపల్లిలో మొత్తం 11 సెక్షన్‌లు ఉండగా వాటిలో 45 నుంచి 47 ఎంజీడీల నీరు అందిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అధికంగా గచ్చిబౌలి, కొండాపూర్, మాదాపూర్ నుంచి ట్యాంకర్ల బుకింగ్‌లు ఉన్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్లను బుక్ చేసుకునే వారి సంఖ్య పెరగడంతో రెండు నుంచి మూడు రోజులు సమయం పడుతుంది. ఒక్కో ట్యాంకరుకు రూ.600 నుంచి 1500 వరకు అక్రమ నీటి వ్యాపారులు వసూళ్లు చేస్తున్నారు.

### సున్నం చెరువులో అక్రమ నీటి వ్యాపారం

మాదాపూర్‌లోని సున్నం చెరువులో అక్రమంగా బోర్లను వేసి ఇష్టానుసారంగా నీటివ్యాపారం చేస్తున్నారు. 20 నుంచి 30 వాటర్ ట్యాంకర్ల ద్వారా నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా గచ్చిబౌలి, నలగండ్ల, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, ఖాజగూడ, మజీద్‌బండా పరిసర ప్రాంతాల్లో అక్రమ నీటి వ్యాపారులు రాత్రిపగలు తేడాలేకుండా నీటిని తోడేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### చేతి పంపులను బాగుచేస్తున్నాం

కూకట్‌పల్లి జలమండలి పరిధిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అదనంగా రెండు ఎంజీడీల నీటిని కలుపుకుని 30 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నాం. అవసరమైన చోట చేతి పంపులను బాగుచేయడం, పవర్ బోరువెల్స్ వద్ద సమస్యలు పరిష్కరించడం, లో ప్రెషర్, లీకేజీ సమస్యలున్న ప్రాంతాలపై దృష్టిపెట్టి ప్రత్యేక మరమ్మతు పనులు చేశాం. తాగునీటి ట్యాంకర్ల కోసం డిమాండ్ పెరగడంతో అందరికీ నీటిని అందించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరుతున్నాం.

**- అంబటి ప్రభాకర్‌రావు, జీఎం, కూకట్‌పల్లి**

### నీటిని పొదుపుగా వాడుకోవాలి

వేసవిలో నీటి అవసరాలు ఎక్కువగా ఉంటాయి. నీటిని పొదుపుగా వాడుకోవాలి. రోజుకు 35 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. ప్రస్తుతం ఉన్న 4 ట్యాంకర్లకు తోడు అదనంగా మరో 3 ట్యాంకర్లను తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఆటోనగర్‌లో ట్యాంకర్ ఫిల్లింగ్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. అవసరమైతే వనస్థలిపురంలోనూ ట్యాంకర్ల ఫిల్లింగ్‌ను ప్రారంభిస్తాం.

**- శ్రీనివాస్‌రెడ్డి, జలమండలి 10బి జనరల్ మేనేజర్, ఎల్బీనగర్**